క్లుప్తంగా

వేరుశనగ విత్తనకాయల పరిశీలన



వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న జేడీ

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనపు కాయలను వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ మంగళవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా నారాయణి రకం వేరుశనగ విత్తనపు కాయలు మంజూరు, రైతులకు ఇప్పటి వరకు అందిన వాటిపై ఆరా తీశారు. విత్తనపు కాయల నాణ్యతను పరిశీలించారు. సబ్సిడీ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ కిషోర్ నాయక్, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు దోపిడీపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి లవకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మంగళవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో డిమాండ్ చేశారు. ప్రైవేటు యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారంటూ ఆరోపించారు. అదే విధంగా పాఠ్యపుస్తకాల విక్రయం పేరుతో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు వేలాది రూపాయలను విద్యార్థుల నుండి అక్రమంగా దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో పోటీతత్వం కలిగి ఉండాలి



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలని గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అష్రఫ్ అలీ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థులకు ఆటల పోటీలు, మంచి పుస్తకాలు చదివించడంతోపాటు పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించామని, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రౌడీ షీటర్లకు మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టించినా, గొడవలకు ప్రేరేపించినా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. టపాకాయలు, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకోరాదని హితబోధ చేశారు. అనంతరం కర్నాటక సరిహద్దులోఉన్న చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు, దిశ సీఐ నాగేంద్ర, స్థానిక ఎస్ఐ రవీంద్రబాబు పాల్గొన్నారు.

ముగిసిన చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర



పూజలందుకున్న చిన్నక్క, పెద్దక్క అమ్మవార్లు



భక్తులను ఆకట్టుకున్న చాందినీ బండ్లు

సుండుపల్లె : మండల కేంద్రంలోని మడితాడు గ్రామంలో వెలసిన చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకొని ముడుపులు చెల్లించుకున్నారు. జాతరలో చాందినీబండ్లు, చెక్కభజనలు, కోలాటాలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

భక్తి శ్రద్ధలతో బోనాల సమర్పణ

సుండుపల్లె : మండల కేంద్రంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ మిట్ట బిడికిలో వెలసిన మారెమ్మ, కాళికాదేవి అమ్మవార్ల జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి



కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రాయచోటి (అన్నమయ్య సర్కిల్) : సకాలంలో వర్షాలు కురిసి మంచిగా పంటలు పండి నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, ఆర్థికంగా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తమిళనాడు రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలను రెండు రోజులపాటు దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలు బాగుండాలని కోరినట్లు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తమిళనాడులోని అరుణాచలం, వేలూరు సమీపంలోని లక్ష్మీ నారాయణి గోల్డెన్ టెంపులు, చిత్తూరు సమీపంలో ఉన్న కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. స్వామి దర్శనం తర్వాత ఆలయ పూజారులు తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వదించారన్నారు. భగవంతుడి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని శ్రీకాంత్‌రెడ్డి కోరుకున్నట్టు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట రాయచోటి నియోజకవర్గానికి చెందిన కల్లూరు నాయకులు ఉన్నారు.

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఓలు మోహనరావు, లీలారాణి

రాజంపేట : వచ్చే నెల 4న జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంటింగ్ సిబ్బంది తీసుకున్న శిక్షణతో పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రాజంపేట, రైల్వేకోడూరు రిటర్నింగ్ అధికారులు టి.మోహనరావు, లీలారాణి పిలుపునిచ్చారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో కౌంటింగ్ సిబ్బందికి ఈటీపీబీఎస్, ఎన్‌కోర్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో పటిష్టంగా పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలను చేపట్టారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఈసీ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. పార్లమెంటు, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లకు 14 చొప్పున ఈవీఎం టేబుళ్లను, అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు టేబుల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది తమకు కేటాయించిన టేబుల్స్ వద్ద ఎటువంటి పొరపాటు లేకుండా తగు జాగ్రత్తల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. సందేహాలను తన దృష్టికి తీసుకురావాల్సి ఉంటుందని సిబ్బందికి సూచించారు. ఈవీఎంలు కేంద్రానికి తీసుకురావడం కానీ, లెక్కింపు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌంటింగ్‌కు హాజరయ్యే ఎన్నికల సిబ్బంది, సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

రాజంపేట టౌన్ : ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని న్యూ ఆంధ్ర కళ్యాణ మండపంలో మంగళవారం తైక్వాండో మాస్టర్ పిచ్చయ్య ఆధ్వర్యంలో క్రీడాకారులకు కోచ్‌లు జాహీద్‌అలీ, శివాజీ, మౌలా, కమల్ పర్యవేక్షణలో బెల్ట్ ఉత్తీర్ణతకై పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు అమర్‌నాథరెడ్డి చేతుల మీదుగా బెల్ట్, రాష్ట్ర అసోసియేషన్ గుర్తింపు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల శారీరక దృఢత్వం కలగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు తల్లిదండ్రులు ఇలాంటి ఆత్మరక్షణ క్రీడల్లో తప్పక శిక్షణ ఇప్పించాలని తెలిపారు. ఈ క్రీడపట్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు కోచ్‌లు తెలియజేసి, పిల్లల్లో సైతం ఆసక్తి పెంపొందించాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఆకేపాటి అన్నారు. రాజంపేట అన్నమయ్య తైక్వాండో అకాడమీ, రైల్వేకోడూరుకు చెందిన ఎస్వీకే అండ్ ఎస్‌కే స్పోర్ట్స్ అకాడమీ, ప్రొద్దుటూరుకు చెందిన విన్ అకాడమీ క్రీడాకారులు ఈ పరీక్షల్లో పాల్గొన్నట్లు కోచ్ జాహీద్‌అలీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రెఫరీ కృష్ణవేణి, సుధాకర్‌బాబు, జ్ఞానసాయి, మనోజ్‌కుమార్, శ్రీకృష్ణ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కృష్ణ, డాక్టర్ విన్య, వైఎస్సార్ సీపీ మహిళా కార్యదర్శి మిర్యాల సురేఖ, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల్లో ఉత్తీర్ణులైన క్రీడాకారులతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు

30న ఆలయ భూముల కౌలు వేలం

సిద్దవటం : మండలంలోని వెంకటాయపల్లె గ్రామంలో వెలసిన శ్రీ అంబాపుర పార్థీశ్వర స్వామి ఆలయ భూములను కౌలుకు ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాయపల్లెలోని దేవస్థానం ఆవరణలో వేలం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటాదారుడు రూ.1000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే ఒక సంవత్సరం మునిగుత్తను చెల్లించి రశీదు పొందాలన్నారు. దేవస్థానానికి ముందు బాకీ ఉన్నవారు బాకీని చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. దేవస్థానం భూములు వెంకటాయపల్లె గ్రామంలో సర్వే నెంబర్ 296లో 1.37 ఎకరాలు, 254లో 2 ఎకరాలు, పొన్నవోలు కొత్తపల్లెలో సర్వేనెంబర్ 137లో 1.82 ఎకరాలు, వెంకటాయపల్లెలో 389/1లో 0.64 సెంట్లు, 228/3లో 0.56 సెంట్లు, 254లో 1.84 ఎకరాలు, పొన్నవోలు కొత్తపల్లెలో 190/2లో 1.12 ఎకరాలు, వెంకటాయపల్లెలో 250/2లో 0.24 సెంట్లు, 343/3లో 0.47 సెంట్లు, 210లో 0.37సెంట్లు, 106/1లో 0.93 సెంట్లు, 108/2లో 0.68 సెంట్లు, కడపాయపల్లెలో సర్వేనెంబర్ 39/2లో0.72 సెంట్లు భూములు ఉన్నాయన్నారు.

మోహిని అవతారంలో భద్రావతి భావనారాయణ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామివారు మోహిని అవతారంలో భక్తులకు దర్శనమించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో భక్తులు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి పల్లకీ నివాస గృహాల గుమ్మం వద్దకు రాగానే మహిళలు కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. బుధవారం స్వామి వారి కల్యాణం జరుపనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరుల పాల్గొన్నారు.



స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయచోటి (జగదాంబ సెంటర్) : పట్టణంలోని కొత్తపేటలో వెలసివున్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి సింధూర పూజలు, ఆకుపూజలు తదితర పూజాది క్రతువులను నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న ఆంజనేయుడు

అంగరంగ వైభవంగా లక్ష్మీనారసింహుడి పుష్పాభిషేకం



లక్ష్మీనరసింహస్వామికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం పెంచలకొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి పుష్పాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పుష్పాభిషేకాన్ని ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద గుండాల్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మన్ శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి 200 బుట్టలలో ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలతో అభిషేకం జరిపారు. లక్ష్మీదేవి, చెంచు లక్ష్మీ, నరసింహస్వామి సమేత ఈ పుష్పాభిషేకాన్ని నిర్వహించామన్నారు. తిరుపతికి చెందిన 11 మంది వేదపండితులతో కార్యక్రమాన్ని వైభవోపేతంగా చేశారు. ఈనెల 22వ తేదీ నుంచి ఆరు రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో చివరిరోజు స్వామి వారికి ఈ పుష్పాభిషేకం నిర్వహించారు.

ఘనంగా పంచసూక్తముల హోమం..

లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముందు ట్రస్టు సభ్యులు జంటలతో ఈ హోమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో వేదపండితులు ఐదు రకాల దేవుళ్ల హోమం ఒకేసారి నిర్వహించారు. ఈ హోమంలో తూర్పుపల్లి, ఈటమాపురం, నాయుడువారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయంలో లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈటమాపురం పంచాయతీలోని తూర్పుపల్లి గ్రామ ప్రజలు కల్యాణంతోపాటు పుష్పాభిషేకానికి వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కొండప్రాంత మందా విద్యుత్ దీపాలతో అలంకరించారు.



బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన పుష్పాలు

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం

సిద్దవటం : శారీరక, మానసిక, ఆరోగ్యంతోపాటుగా పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఏసీడీపీఓ శోభారాణిలు తెలిపారు. మండలంలోని బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ రుతుస్రావం పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా యుక్త వయస్సు పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం గ్రామంలోని పురవీధుల్లో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుక్త వయస్సు వచ్చాక రజస్వల మొదలుకొని మెనోపాజ్ వరకు రుతుస్రావం ఉంటుందన్నారు. నెలసరి సమయంలో స్త్రీలను అంటరానివారి లాగా చూసే సంస్కృతి ఇంకా చాలా మందిలో ఉందన్నారు. ఇది సాంఘికంగా అన్యాయమని వారికి మానసికంగా ధైర్యాన్ని ఇచ్చారు. అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే వాడేసిన శానిటరీ న్యాప్కిన్స్‌ను శుభ్రంగా పేపర్‌లో, కవర్‌లో చుట్టి కాల్చివేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీవిద్య, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బంగారుపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కొలువుల జాతర

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ ఫార్మసిటికల్ అధినేత సతీష్ మాట్లాడుతూ ఐటీలలో చదువుకొని కూడా నిరుద్యోగులుగా ఉన్నావారు చాలా మంది ఉన్నారన్నారు. ఈ తరుణంలో పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి జీతంతో అతి చిన్న వయసులో మంచి మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడం హర్షణీయమన్నారు. ప్రిన్సిపాల్ డా.సుధాకర్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో 39 మంది, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 31 మంది పాసయ్యారన్నారు. వీరికి క్యాంపస్ సెలక్షన్‌లో మేఘా ఇంజనీరింగ్, అదానీ ఇండస్ట్రీస్, డైకిన్, హెచ్‌ఎల్ మాండో, జీఈ ఏరోస్పేస్, గ్రీన్ టెక్, సీఎస్ ప్లానర్స్ వంటి సంస్థలలో మంచి జీతం, మెరుగైన సదుపాయాలతో ఉద్యోగాలు రావడం శుభపరిణామమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.పి.సుజాత మాట్లాడుతూ డిప్లమా పూర్తి చేసుకున్న విద్యార్థులు రూ.25 నెల జీతంతో మిగిలిన అలవెన్సులు పొందుతూ వారి తల్లితండ్రులపై ఆర్థికభారం మోపకుండా సంస్థ ద్వారానే ఉన్నత చదువులకు సదుపాయం కల్పించారన్నారు. ఈనెల 23న అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, 25న డైకిన్ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించాయన్నారు. ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నియామక పత్రాలతో డిప్లమా విద్యార్థులు

డేగనవాండ్లపల్లెలో నాకాబందీ

సిద్దవటం : మండలంలోని డేగనవాండ్లపల్లెలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు మంగళవారం నాకాబందీ, కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఒంటిమిట్ట ఎస్ఐ పురుషోత్తంరాజ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు పటాసులు కాల్చడం చేయకూడదని గ్రామ ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని ఆయన హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉందని ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను పాటించాలని గ్రామాల్లో ఎవరైనా కక్షపూరితంగా గొడవలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ పురుషోత్తంరాజు

'మహిళలు జగనన్న రుణం తీర్చుకున్నారు'

రాజంపేట రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు శాసనసభ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో మంగళవారం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని సురేఖ కలిశారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా సీఎం జగనన్న నిలిచారని, అందువలనే అధిక శాతంలో మహిళలు తరలివచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారని తెలియజేశారు. ఆకేపాటికి మంత్రి పదవి రావాలని రామేశ్వరం యాత్ర చేపట్టి వివిధ ప్రదేశాలలో కొలువుదీరిన వివిధ దేవుళ్లకు మొక్కుకున్నట్లు చెప్పారు. అనంతరం పుణ్యక్షేత్రాల నుంచి తీసుకొచ్చిన ప్రసాదాలను ఆయనకు అందజేశారు.

హోరాహోరీగా నందలూరు ప్రీమియర్ లీగ్

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో పోలీసు జట్టుపై గాంధీనగర్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 14 ఓవర్లలో 140 పరుగులు చేసింది. పోలీసు జట్టులో రాజంపేట డీఎస్పీ వీఎస్‌కే చైతన్య నాలుగు ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన పోలీస్ జట్టు 14 ఓవర్లలో 115 పరుగులకు 9 వికెట్లు కోల్పోయి పరాజయం చెందింది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ 41 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా జట్టుకు విజయం అందించలేకపోయారు. గాంధీ నగర్ జట్టు ఆటగాడు 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు బాలాజీ నాయకులు శివశంకర్, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బుల చేతులమీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు.

సూపర్ ఓవర్‌లో మంటపంపల్లె జట్టు విజయం

మధ్యాహ్నం కింగ్స్ డాబా మంటపంపల్లి, ఫాల్కన్స్ అరవపల్లె జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠ భరితంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన డాబా జట్టు 14 ఓవర్లలో 132 పరుగులకు 9 వికెట్లు కోల్పోయింది. అనంతరం 133 పరుగుల విజయ లక్ష్యంతో దిగిన ఫాల్కన్ జట్టు 14 ఓవర్లలో 132 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్ టై అయ్యింది. అనంతరం ఆర్గనైజర్స్ సూపర్ ఓవర్ ఆడవలసిందిగా ఇరు జట్లకు సూచించారు. మొదటి సూపర్ ఓవర్‌లో ఫాల్కన్ జట్టు ఒక వికెట్ కోల్పోయి ఆరు పరుగులు మాత్రమే చేసింది. అనంతరం కింగ్స్ డాబా జట్టు ఏడు పరుగులు చేసి విజయం సాధించింది. రెండు ఓవర్లు వేసి మూడు వికెట్లు తీసిన సాయి రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు. ఈ మ్యాచ్‌కు జాతీయ దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు మున్నా అంపైర్లుగా, స్కోరర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్ క్రీడాకారులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న ప్రవీణ్